# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 31-08-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **ఆంధ్రప్రదేశ్‌లోని మార్కాపురం జిల్లా వెలిగొండ సాగునీటి ప్రాజెక్టు తొలి దశను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ప్రారంభిస్తారు.**

**2.** **రైతులు సేంద్రియ పంటలకు ప్రాధాన్యమివ్వాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖమంత్రి జి.కిషన్‌రెడ్డి సూచించారు.**

**3.** **తిరుమల తరహాలో ఆంధ్రప్రదేశ్‌లోని వాడపల్లిని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు.**

**4.** **స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధనలో ప్రవాసాంధ్రులు భాగస్వాములు కావాలని ఆంధ్రప్రదేశ్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు.**

===========================

ఆంధ్రప్రదేశ్‌లోని మార్కాపురం జిల్లా వెలిగొండ సాగునీటి ప్రాజెక్టు తొలి దశను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ప్రారంభించి నీటిని విడుదల చేయనున్నారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని ప్రాంతాలకు తొలి దశలో 10.70 టీఎంసీల కృష్ణా జలాలను నల్లమలసాగర్‌కు విడుదల చేయనున్నారు. “వెలిగొండ జలసిరులు-అభివృద్ధికి రెక్కలు” పేరుతో ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహించనున్నట్లు సమాచార ప్రజా సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొంటూ..

వాయిస్..30.. సెకన్లు

-------------------------

వెలిగొండ ప్రాజెక్టుతో మార్కాపురం ప్రాంతం రూపురేఖలు మారనున్నాయని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తితో కరవు ప్రాంతాలకు సాగు, తాగునీటి భద్రత మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. తద్వారా వ్యవసాయం, ఉద్యాన, ఉపాధి అవకాశాలు పెరిగి మార్కాపురం ప్రాంత అభివృద్ధికి అవకాశం ఏర్పడుతుందని అన్నారు. వెలిగొండ నిర్వాసితులకు 48 రోజుల్లో 768 కోట్ల రూపాయల పరిహారం అందించినట్లు మంత్రి తెలిపారు.

-------------------------

రైతులు సేంద్రియ పంటలకు ప్రాధాన్యమివ్వాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖమంత్రి జి.కిషన్‌రెడ్డి సూచించారు. తెలంగాణలోని వికారాబాద్ జిల్లా తాండూరు మండలం జిన్‌గుర్తిలో ఏకలవ్య గ్రామీణ వికాస ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన నైపుణ్యాభివృద్ధి కేంద్రం, మురుగుశుద్ధి ప్లాంట్, టాటా భూసార పరీక్షల ప్రయోగశాల, భవనాలను కిషన్‌రెడ్డి నిన్న ప్రారంభించారు. సేంద్రియ సాగులో రాణించిన మహిళా రైతులకు ఈ సందర్భంగా బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రసాయన ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ వ్యవసాయం చేయాలని సూచించారు. వ్యవసాయ విధానాలలో మార్పు రావాల్సిన అవసరం ఉందని సూచించారు.

---------------------------

స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధనలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రవాసాంధ్రులు భాగస్వాములు కావాలని ప్రవాసాంధ్రుల సాధికారత శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు. మలేషియాలోని పెనాంగ్‌లో జరిగిన ఆసియా పసిఫిక్ తెలుగు సమాఖ్య-ఏపీటీఎఫ్ సదస్సు-2026లో మంత్రి నిన్న ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విదేశాల్లో స్థిరపడినా ప్రవాసాంధ్రులు వారి మూలాలు, భాషా సంస్కృతులను పరిరక్షించేందుకు కృషి చేయాలన్నారు. ప్రవాసాంధ్రుల సమస్యల పరిష్కారానికి, వారి నైపుణ్యాలను రాష్ట్ర అభివృద్ధితో అనుసంధానించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రవాసాంధ్రుల సంఘం- ఏపీఎన్ఆర్‌టీఎస్ వారధిగా పనిచేస్తుందని మంత్రి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని మారుమూల గిరిజన ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా వైద్య సేవలు అందిస్తూ సత్ఫలితాలు సాధిస్తున్నామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో జనవరి నుంచి నాలుగు డ్రోన్లతో ఇప్పటివరకు వెయ్యి 800కు పైగా ట్రిప్పులు నిర్వహించామని, ఈ సేవలతో 24 వేల 500 మందికి పైగా రోగులకు ప్రయోజనం కలిగిందని మంత్రి తెలిపారు. వైద్య నమూనాలు త్వరగా ప్రయోగశాలలకు చేరడంతో సికిల్‌సెల్ వ్యాధి స్క్రీనింగ్‌తో పాటు ఇతర పరీక్షలు సకాలంలో పూర్తవుతున్నాయని తెలిపారు. డ్రోన్ కార్యకలాపాల్లో స్థానిక గిరిజన యువత భాగస్వామ్యాన్ని పెంచేందుకు 25 మందికి పైగా శిక్షణ ఇచ్చినట్లు మంత్రి సత్యకుమార్ తెలిపారు.

---------------------------

పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామానికి చెందిన రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆర్థిక సాయం ప్రకటించారు. ఒక్కో మృతుడి కుటుంబానికి 10 లక్షల రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 27న చిలకలూరిపేట సమీపంలో విజయవాడ నుంచి తిరుపతి వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు... ఆటోను ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో వేలూరు గ్రామానికి చెందిన 8 మంది మృతి చెందారు.

---------------------------

కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి గాంచిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయాన్ని తిరుమల తరహాలో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి ఆలయంలో ఆరు కోట్ల 25 లక్షల రూపాయల కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులతో నిర్మించిన అన్నదాన భవనాన్ని ఆయన నిన్న ప్రారంభించారు. భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఆలయంలో మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన

అవసరం ఉందని కేంద్ర మంత్రి ఈసందర్భంగా తెలియజేస్తూ,

వాయిస్ ..30.. సెకన్లు

---------------------------

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తి చేసుకోవడం ముఖ్యమైన మైలురాయిగా నిలిచిందని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు మూడు కోట్ల 42 లక్షల మందికి ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున ఉచిత సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని అర్హులైన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిమితి 10 లక్షల రూపాయలకు పెంపు వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.. రైతు భరోసాను ఎకరానికి 12 వేల రూపాయలకు పెంచామని, ధాన్యం కొనుగోళ్లతో పాటు సన్నవడ్లకు అదనపు నగదు అందించామని వెల్లడించారు.

---------------------------

రైతుల సంక్షేమం, ప్రజలకు నాణ్యమైన కూరగాయలు అందించడమే లక్ష్యంగా భట్టిప్రోలు మార్కెట్ యార్డులో నూతన రైతు బజార్ నిర్మించనున్నట్లు వేమూరు శాసన సభ్యులు నక్కా ఆనందబాబు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా భట్టిప్రోలులో రైతు బజార్ నిర్మాణానికి ఆయన నిన్న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ వేమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో 49 లక్షల 50 వేల రూపాయల అంచనా వ్యయంతో ఈ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. రైతులు పండించిన పంటలకు మెరుగైన మార్కెట్ కల్పించడమే రైతు బజార్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

---------------------------

హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు జయంతి ఈరోజు. సంగీతం, సాహిత్యం నృత్యాల మేళవింపుతో హరికథా ప్రక్రియకి విశేష ప్రచారం కల్పించిన ఆయన.. 1864 ఆగస్టు 31వ తేదీన విజయనగరం జిల్లా అజ్జాడ గ్రామంలో జన్మించారు. రచయిత, కవి, బహుభాషాకోవిదులు అయిన నారాయణదాసు తెలుగులో 17, సంస్కృతంలో 3, అచ్చతెలుగులో ఒక హరికథను స్వయంగా రచించారు. హిందుస్థానీ, భైరవి రాగాలాపనకు గానూ రవీంధ్రనాథ్ ఠాగూర్‌తో ప్రశంశలు అందుకున్న ఆదిభట్ల నారాయణదాసు 1945 జనవరి 2వ తేదీన తుదిశ్వాస విడిచారు.

---------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి, ఉపరితల ఆవర్తన ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా, రాయలసీమ జిల్లాలలో ఈరోజు, రేపు ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై వాతావరణ శాఖ అధికారి ఎల్.నారాయణ తెలియజేస్తూ,

వాయిస్ ..30.. సెకన్లు

మరోవైపు తెలంగాణ వ్యాప్తంగా పలు జిల్లాల్లో ఈరోజు ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలైన ఆదిలాబాద్, కొమరంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

=====================